గాంధీ దవాఖాన వద్ద మంత్రి సీతక్కను అడ్డుకుంటున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

సీతక్కకు నిరసన సెగ

- గాంధీలో అడ్డుకున్న మహిళలు
- గేటు వద్ద మంత్రితో వాగ్వాదం
- ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 5 : ఆటోడ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆదివాసి మహిళను గాంధీ దవాఖానలో గురువారం పరామర్శించేందుకు వచ్చిన మంత్రి సీతక్కకు మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, కార్యకర్తలు, మహిళలు గాంధీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు.ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యంతో మంత్రి బాధితురాలిని పరామర్శించారు.

మతం రంగు పులుమొద్దు : సీతక్క

జైనూరు ఘటనకు మతం రంగు పులుమొద్దని మంత్రి సీతక్క హితవు పలికారు. నిందితుడిని ఉరితీయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆమె తప్పుపట్టారు. లైంగిక దాడి నిందితులను ఉరి తీసేలా కేంద్రం చట్టం చేస్తే అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. అలాంటి చట్టాన్ని బీజేపీ నేతలు తీసుకురాగలరా? అని మంత్రి సవాల్ చేశారు. నిందితుడికి కఠిన శిక్షణ పడేవరకు ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు గిరిజన సంక్షేమ శాఖ తరపున రూ.లక్ష చెక్కు అందచేశారు.

మానవత్వంతో చూడాలి: కేంద్రమంత్రి బండి

జైనూర్‌లో ఓ వర్గం యథేచ్ఛగా దాడులు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోని అసమర్థ సర్కారు ఇది అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. గురువారం రాత్రి గాంధీ దవాఖానలో బాధితురాలిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆదివాసీమహిళపై జరిగిన దాడిని చూస్తే మానవత్వం ఉన్నవారెవరూ తట్టుకోలేరని చెప్పారు. ప్రభుత్వం లక్ష ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏం బాగోలేదని విమర్శించారు. మతపరమైన ఘటనగా చూడకుండా మానవత్వంతో మహిళకు జరిగిన అన్యాయంగా చూడాలని చెప్పారు.

ఇంత నిర్లక్ష్యం ఎందుకు : మహేశ్వర్ రెడ్డి

జైనూర్‌లో గిరిజనులపై దాడులు పెరిగినా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని బీజేపీ శాసన సభ పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఘటనపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని నిలదీశారు. గాంధీలో బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఘటన జరిగి ఇప్పటికే ఐదు రోజులైందని, ఆమెపై లైంగికదాడి జరగినట్టు వైద్యులు నిర్ధారణ చేయకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తున్నదని చెప్పారు.

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 5 : మహిళల రక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. జైనూర్ వెళ్తుండగా కెరమెరి ఘాట్ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులపై ఆమె తీవ్ర ఆగ్రహం చేసి ఆసిఫాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్య యత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నిందితుడికి యావజ్జీవ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళను పరామర్శించి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరినట్టు తెలిపారు.

పోలీస్ పహారాలో జైనూర్

- వెయ్యి మందితో పటిష్ట బందోబస్తు
- 48 గంటల 144 సెక్షన్
- ఆసిఫాబాద్ జిల్లాలో ఇంటర్నెట్ బంద్
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి అడ్డగింత
- ఎమ్మెల్యే పాయల్ శంకర్ హౌస్ అరెస్ట్

మంచిర్యాల, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదివాసీ మహిళపై ఓ వర్గం వ్యక్తి దాడి ఘటనతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దాదాపు 1000 మంది పోలీసులు జైనూర్‌లో పహారా కాస్తున్నారు. రెండు ఫైర్ ఇంజిన్లను రప్పించి గురువారం మధ్యాహ్నం వరకు షాపుల్లోని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. పడిపోయేలా ఉన్న మూడు బిల్డింగ్‌లను జేసీబీతో కూల్చివేశారు. రోడ్లపైకి ఎవరూ రాకుండా గస్తీ కాస్తున్నారు. జైనూర్‌లో గురువారం ఉదయం నుంచి 48 గంటల పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రకటించారు. జైనూర్‌తోపాటు ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇల్లు విడిచి ఎవరూ బయటికి రావొద్దని, ఇద్దరికి మించి రోడ్ల మీద గుంపులుగా కనిపించొద్దని ఆదేశాలు జారీచేశారు. మండలం కేంద్రంలోని ప్రతి గల్లీలోనూ పోలీసులు కాపలా ఉన్నారు.

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దాత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బాలానగర్ డీసీపీ (ఆసిఫాబాద్ పాత ఎస్పీ) సురేశ్‌కుమార్ జైనూర్‌లోనే ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జైనూర్‌లోని ఓ వర్గానికి చెందిన పెద్దలతో పాటు, ఉట్నూర్‌లోని కుమ్రం భీం భవన్‌లో ఆదివాసీ నాయకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. సంయమనం పాటించాలని, శాంతియుతంగా ఉండాలని సూచించారు. జైనూర్‌కు వెళ్లే ఆరు మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతరులెవరినీ లోపలికి అనుమతించడం లేదు. మీడియానూ బయటే ఆపేసి, తిరిగి పంపించేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. జిల్లా వ్యాప్తంగా 30 యాక్ట్ అమలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, మీటింగ్‌ల నిర్వహణపై నిషేధం విధించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఘటనా స్థలికి వెళ్తుండగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకొని వెనక్కి పంపించారు.

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

జైనూర్‌లో శాంతి నెలకొనాలి : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో తక్షణం శాంతినెలకొనాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని, అల్లర్లలో ఇండ్లు, షాపులు కోల్పోయినవారికి సాయమందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కేవలం రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయన్న ముందస్తు సమాచారం ఉన్నా వాటిని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్తి స్థాయిలో హోం మంత్రి లేకుండానే రాష్ట్రాన్ని నడపటం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

నిరంకుశత్వంతో భయపెట్టలేరు

తెలంగాణ బిడ్డలను చట్టవిరుద్ధంగా, అక్రమంగా, నిరంకుశంగా అరెస్ట్ చేసి భయపెట్టలేరనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని కేటీఆర్ స్పష్టం చేశారు. అలా చేయాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరోటి ఉండదని చెప్పారు. వరద సాయం విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ఆరు గ్యారెంటీల డొల్లతనాన్ని బయటపెట్టి, ప్రజల ముందు సర్కారు సిగ్గుపడేలా చేశాడనే అక్కసుతోనే ఆయనను అరెస్ట్ చేశారని ఎక్స్ వేదికగా కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ చేతగాని పాలన, అవినీతి, అక్రమాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధిచెప్తారని స్పష్టంచేశారు.

రెచ్చగొట్టే ప్రయత్నాలు చెయ్యొద్దు : పోలీస్‌శాఖ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): జైనూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొన్నదని, స్థానికుల్లో మనోధైర్యం కలిగించేందుకు చర్యలు చేపట్టామని తెలంగాణ పోలీస్ శాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఇరువర్గాలకు అవగాహన కలిగించి సాధారణ పరిస్థితి నెలకొనేలా కృషి చేస్తున్నట్టు తెలిపింది.అత్యంత సున్నితమైన ఈ అంశంపై వివిధ సామాజికవర్గాలను రెచ్చగొట్టేవిధంగా ఎలాంటి సామాజిక, రాజకీయ ప్రకటనలు చేయొద్దని కోరింది. ఎవరైనా ప్రేరేపించే, ఉసిగొలిపే ప్రకటనలు చేస్తే వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని, రెచ్చగొట్టే వార్తలు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఈ విషయంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు శాంతిభద్రతలు కాపాడేలా సహకరించాలని కోరింది.

ఘటనపై వివరాలివ్వండి : జాతీయ ఎస్టీ కమిషన్

జైనూర్‌లో ఆదివాసీ మహిళపై దాడికి సంబంధించిన వివరాలు అందించాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని డీజీపీ జితేందర్‌ను జాతీయ ఎస్టీ కమిషన్ గురువారం ఆదేశించింది. ఘటన గురించి తెలుసుకున్న కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ గాంధీ దవాఖానకు వెళ్లి బాధిత మహిళను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. బాధితురాలిని తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద సైతం పరామర్శించారు.

లోకం పోకడ

హైడ్రాపేరుతో మీరు సంపాయించిన ఈ డబ్బుల్తో బఫర్‌జోన్, ఎఫ్.టీ.ఎల్ పరిధిలోలేని ప్లేసులో ఓ బంగళా కట్టుకుందామండీ!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.2°c	24.6°c
కరీంనగర్	31.0°c	26.0°c
ఖమ్మం	31.0°c	24.0°c
రంగారెడ్డి	30.9°c	21.8°c
నల్లగొండ	30.0°c	22.4°c
హైదరాబాద్	30.8°c	22.7°c
మహబూబ్‌నగర్	29.1°c	21.4°c
వరంగల్	29.0°c	25.0°c
నిజామాబాద్	29.0°c	23.4°c
మెదక్	22 .2°c	30.3°c

మరో ఐదు రోజులు భారీ వర్షాలు

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రానికి ఎల్లో హెచ్చరికలు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గురువారం నుంచి ఈ నెల 9 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్ర– దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొన్నది. ఏపీలో రాగల 24 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు

జిల్లా	మండలం	వర్షపాతం(సెం.మీ)
భద్రాద్రికొత్తగూడెం	పినపాక	11.16
ములుగు	వెంకటాపురం	10.62
భద్రాద్రికొత్తగూడెం	అశ్వపురం	9.07
భద్రాద్రికొత్తగూడెం	మణుగూరు	9.04
భద్రాద్రికొత్తగూడెం	చెర్ల	8.94
ములుగు	మంగపేట	8.34
ఖమ్మం	ఎర్రుపాలెం	7.28
భద్రాద్రికొత్తగూడెం	గుండాల	6.50
భద్రాద్రికొత్తగూడెం	అల్లపల్లి	6.29
కుమురంభీం ఆసిఫాబాద్	పెంచికల్‌పేట	5.93

హైదరాబాద్‌లో ఖరీదైపోతున్న రియల్టీ

పెరిగిన వడ్డీ రేట్లు.. తగ్గిన కొనుగోలు స్థోమత

మ్యాజిక్‌బ్రిక్స్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): దేశంలో రియల్టీ రంగం దూసుకుపోతుంటే.. ప్రజల్లో కొత్త ఇల్లు కొనుగోలు చేసే స్థోమత తగ్గిపోతున్నదని మ్యాజిక్‌బ్రిక్స్ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఆదాయం, ఖర్చుల మధ్య అంతరాల కారణంగా ఈఎంఐలూ భారంగా మారుతున్నాయని పేర్కొన్నది. ఈఎంఐల భారం గత ఏడాదితో పోలిస్తే 7.5 శాతం పెరిగినట్టు తెలిపింది. మ్యాజిక్‌బ్రిక్స్ దేశంలోని పది మెట్రో నగరాల్లో కొనుగోలు స్థోమతను అంచనా వేసింది. కొనుగోలు స్థోమత అత్యధికంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (14.3%), ఢిల్లీ (10.1%)లో ఉన్నట్టు పేర్కొన్నది. 2021–2022 నాటికి దేశంలో రెసిడెన్షియల్ రంగంలో పెట్టుబడులు భారీగా ఉండేవని మ్యాజిక్ బ్రిక్స్ సీఈవో సుధీర్ పాయ్ తెలిపారు. పెరిగిన వడ్డీ రేట్లు, ఖర్చు భారంతో రెసిడెన్షియల్ ప్రాజెక్టులు సామాన్యుడికి దూరమైతున్నాయని వివరించారు.

హైడ్రా ఫిర్యాదుపై కేసులో ఎమ్మార్వోకు ఊరట

హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలకు సహకారం అందించారని ఆరోపిస్తూ హైడ్రా కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది.ఆయనకు గురువారం ముందస్తు బెయిలు మంజూరు చేసింది. నిజాంపేట మున్సిపాలిటీ, ప్రగతినగర్‌లో మూడు ఎకరాల్లోని ఎర్రకుంట ఆక్రమణలకు సహకరించారనే కేసులో పిటిషనర్ రెండో నిందితుడిగా ఉన్నారు. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, సర్వే శాఖ సహాయ డైరెక్టర్ కే శ్రీనివాసులు, సహాయ ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్‌పై ఆగస్టు 30న కేసు నమోదైంది. పూల్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కే సుజన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. పూల్‌సింగ్ 2023 ఆగస్టులో ఎమ్మార్వోగా బాధ్యతలు చేపట్టారని, అప్పటికే అనుమతులు జారీ అయ్యాయని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు.

స్థానికతను తేల్చండి

మొదటిపేజీ తరువాయి...

అడ్మిషన్ల నిబంధనలు– 2017కు సవరణగా 3(ఎ) నిబంధన చేర్చుతూ ప్రభుత్వం ఈ ఏడాది జూలై 9న జారీచేసిన జీవో 33ను రద్దు చేయాలంటూ దాఖలైన సుమారు 53 వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం 71 పేజీల తీర్పును వెలువరించింది.

జీవో 33 రద్దుకు నిరాకరణ

మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరించి నిబంధన 3(ఎ)ను చేరుస్తూ జారీచేసిన జీవో 33ను రద్దు చేస్తే తెలంగాణవాసులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంటుందని, దేశవ్యాప్తంగా ఉన్నవారందరూ 85 శాతం స్థానిక కోటా కింద అడ్మిషన్లు పొందేందుకు వీలు ఏర్పడుతుందని ధర్మాసనం పేర్కొన్నది. కాబట్టి సవరణ నిబంధనను రద్దు చేయడం లేదని పేర్కొంది. ఈ నిబంధన కింద తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్నవారు స్థానిక కోటా కింద మెడికల్ అడ్మిషన్లు పొందడానికి అర్హులేనని తేల్చింది. విద్యార్థి స్థానికత నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు లేనందున వాటిని రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించాక వాటిని పరిశీలించి ప్రతి విద్యార్థిని స్థానిక కోటా కింద అన్వయించి కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం సీట్లను కేటాయించాలని ఉత్తర్వులు జారీచేసింది. నిబంధన ప్రకారం నాలుగేండ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని, శాశ్వత నివాసం ఉండాలని పేర్కొన్నది. అర్హత పరీక్షలో తెలంగాణ నుంచి ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పింది. తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్నవారికి మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించడమే ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ నిబంధన 3(ఎ) లక్ష్యమని తెలిపింది. తెలంగాణకు చెందిన వ్యక్తి అర్హత పరీక్షలో ఇక్కడ ఉత్తీర్ణత సాధించలేదన్న కారణంగా అడ్మిషన్ నిరాకరిస్తే ఆ నిబంధన ఉద్దేశం నెరవేరనట్లేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ తీసుకువచ్చిన ఈ నిబంధన తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్నవారికి వర్తించదని పేర్కొంది.

తెలంగాణ విద్యార్థి వేరే రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాయవచ్చు

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసితులైన వారు 85 శాతం స్థానిక కోటా కింద అర్హులేనని హైకోర్టు పేర్కొంది. తెలంగాణ విద్యార్థి ఇతర రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాశారని స్థానికత నిరాకరించడం సరికాదని హైకోర్టు తీర్పులో పేర్కొన్నది.

ఐఎంజీబీ భూములపై తీర్పు వాయిదా

క్రీడల అభివృద్ధి పేరుతో ఐఎంజీ భారత్ అకాడమీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉమ్మడి ఏపీలో 2003లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు భూములు, పలు స్టేడియాలను ఇవ్వడం మీద దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. భూకేటాయింపుల వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది శ్రీరంగారావు వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ కేసులో తీర్పును వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది.

ఇంజినీరింగ్ కాలేజీలకు చుక్కెదురు

మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులకు అనుమతివ్వాలని దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. జేఎన్‌టీయూ, ఏఐసీటీఈలు అనుమతించిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వీలుగా మధ్యంతర ఉత్తర్వుల జారీకి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి నిరాకరించారు. మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంజీఆర్, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి కాలేజీ, అనురాగ్ ఇంజినీరింగ్ కాలేజీ, సీఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర కాలేజీలు వేర్వేరుగా దాఖలు 11 వ్యాజ్యాల తరపున సీనియర్ న్యాయవాదులు డీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, 2024– 25 విద్యాసంవత్సరం ఆగస్టు 19 నుంచే మొదలైందని, మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభావం పడుతుందని చెప్పారు. ఈ వాదనలను ఆమోదించిన న్యాయమూర్తి కాలేజీల పిటిషన్లను కొట్టివేశారు.

సివిల్ సప్లయిస్ స్కాంపై నేడు హైకోర్టు విచారణ

తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అక్రమాలు జరిగాయని హైకోర్టులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, ఆ సంస్థ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి దాఖలుచేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు శుక్రవారం విచారణ జరుపనుంది. ప్రభుత్వ ఖజానాకు రూ.1100 కోట్ల నష్టం కలిగించేలా అక్రమాలు జరిగాయని పిటిషనర్ ఆరోపించారు. బిడ్డర్లకు తక్కువ ధరకు వడ్లను విక్రయించి అత్యధిక ధరకు బియ్యం కొనుగోలు చేయడం ద్వారా పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని పేర్కొన్నారు.

కాగజ్‌ఘట్‌లోని రిసార్ట్‌లోని వెళ్లడానికి అసైన్డ్‌భూమిలో నుంచి వేసిన ప్రధాన రహదారి

అలీ చెరువు ఆగమాగం!

- నీటి వనరుకు రియల్ చెర
- ఎఫ్‌టీఎల్, బఫర్‌లోనూ యథేచ్ఛగా విల్లాల నిర్మాణం
- ఇష్టానుసారంగా క్లబ్‌హౌజ్‌లు, సిమ్మింగ్‌పూల్ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అదో రిసార్ట్.. క్లబ్‌హౌజ్‌లు.. స్విమ్మింగ్ పూల్.. ఖరీదైన విల్లాలు.. ఈ నిర్మాణాలన్నీ ఉన్నవి ఒక చెరువులో. ఆ దృశ్యాలను చూడాలంటే హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని కాగజ్‌ఘట్‌కు వెళ్లాల్సిందే. లేక్‌వ్యూను తలదన్నే రీతిలో ఓ రియల్ సంస్థ యథేచ్ఛగా ఒక నీటి వనరుకు నిలువునా ఉరివేసింది. అంతేకాదు ఎగువ నుంచి వచ్చే వరద మార్గాన్ని మూసేసి మరో రెండు చెరువులకు మరణ శాసనాన్ని లిఖించింది. ఇంత జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఏం చేస్తున్నారు అనుకుంటున్నారా? వారికి నోటీసులు ఇచ్చి చెరువు దీనస్థితిపై హైడ్రాకు లేఖ రాశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు మాత్రమే ఉండే హైడ్రాకు లేఖ రాయడమంటేనే అందులో మతలబు ఉన్నదని అర్థం అవుతుంది. నీటిపారుదల శాఖ చర్యలు తీసుకోదు. హైడ్రా పరిధిదాటి రాదు. అంతే సంగతులు!!

అధికార యంత్రాంగం ఈ స్థాయిలో ఎందుకు వత్తాసు పలుకుతున్నదంటే.. కొంతకాలం కిందట బీహార్ అసెంబ్లీలో నితీశ్‌కుమార్ బలపరీక్ష సందర్భంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు రాజకీయం ఈ రిసార్ట్‌లోనే కొలువుదీరింది. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి క్యాంపును పరిశీలించేందుకు వచ్చినపుడు అధికారులు సర్కారు సొమ్ముతో అక్కడికి బీటీ రోడ్డును నిర్మించారు.

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి రెవెన్యూ పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో అలీ (అల్ల చెరువు) చెరువు విస్తరించి ఉన్నది. కాగజ్‌ఘట్ గ్రామం ఎగువభాగంలోని జాపాల అటవీప్రాంతంతో పాటు గున్‌గల్, గడ్డమల్లాయిగూడ గుట్టల ప్రాంతం నుండి వచ్చే వరద నీటిని నిల్వ చేసేందుకు నిజాం నాటి కాలంలో ఈ చెరువును నిర్మించారు. ఈ చెరువు అలుగుపారి దిగువన ఉన్న నోముల గ్రామపరిధిలోని ఊశమ్మ చెరువు, రెడ్డి చెరువు, ఊర చెరువులకు వరద నీరు అందిస్తుంది. అంటే అలీచెరువు పారితేనే దిగువన ఉన్న మూడు చెరువులకు జీవం వస్తుంది. కానీ ఓ రియల్ సంస్థ ఈ చెరువు గొంతు నులిమింది. ఏకంగా ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టింది. చెరువు పైభాగంలో వెంచర్ ఏర్పాటు చేసి, రోడ్లు వేసి అందులో విల్లాల నిర్మాణం చేపట్టింది. అలాగే చెరువులోకి నీరు వచ్చే ప్రధాన కాలువలోని కొంత భాగంలో సిమ్మింగ్‌పూల్ ఇతర ఆట వస్తువులతో పాటు పెద్దపెద్ద గెస్ట్‌హౌస్‌లను నిర్మించింది. ఇందులో భాగంగా భారీఎత్తున మట్టి తెచ్చి చెరువు ఎఫ్‌టీఎల్‌ను పూడ్చారు. దీంతో ప్రస్తుతం అలీ చెరువు సగం కంటే ఎక్కువగానే కనుమరుగైంది.

నోటీసులు ఇస్తే కోర్టుకు వెళ్లరా?

హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల దరిమిలా నోటీసులు ఇస్తే కోర్టుకు వెళతారనే ఉద్దేశంతో అసలు నోటీసులు ఇవ్వకుండానే బుల్డోజర్లతో నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. కానీ అలీ చెరువు విషయంలో మాత్రం కండ్ల ముందు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్పష్టంగా కనిపిస్తున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఎంచక్కా నోటీసులు ఇచ్చారు. ఇంకే ముంది.. సదరు సంస్థ అసలు ఎఫ్‌టీఎల్ నిర్ధారణనే తప్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని అధికారులే చెప్తున్నారు. అయితే సర్వే చేసి, హద్దులు నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.